ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు

5

మంగళవారం 30 జూలై 2024

మన రికార్డులెంత భద్రం..?

- చెదలు పడతాయి.. వానకు తడుస్తాయి..
- గదులకు తలుపులుండవు.. కిటికీలు ఉండవు..
- అధ్వానంగా తహసీల్దార్ కార్యాలయాలు
- సబ్ కలెక్టర్ కార్యాలయం కాల్చివేత తర్వాత.. అధికారుల హడావుడి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పెద్ద రెవెన్యూ సబ్ డి విజన్ మదనపల్లెలో వారం రోజుల కిందట సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డులను గత ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక భూఆక్రమణలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు కొందరు కాల్చేశారు. ఇందులో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులే ముఖ్య భూమిక వహించడం దారుణం. ఇంటి దొంగలు.. బయటి వ్యక్తులతో లాలూచీపడి.. రికార్డులను కాల్చి బుగ్గి చేశారు. దీని వల్ల సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సుమారు 2400 రన్నింగ్ ఫైళ్లు కాలిపోయాయి.. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఒకటో, రెండో నియోజకవర్గాలు కాకుండా దాదాపు జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అప్పటి అధికార వైసీపీ నాయకులు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అక్రమార్కులు ఆందోళన చెందుతున్నారు. తమ అక్రమాలు వెలుగులోకి రాకుండా ఉండేందుకు.. అక్రమాలకు ఎటువంటి ఆనవాళ్లు లేకుండా చేసే ప్రమాదముంది. దీనికితోడు ప్రస్తుతం జిల్లాలోని చాలా తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డు గదులు ఏమాత్రం భద్రంగా లేవు. చాలా గదులకు కిటికీలు లేవు. ఎవరైనా సరే బయట నుంచే రికార్డులకు నష్టం కలిగించే అవకాశం ఉంది. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సంఘటన మాదిరే జరిగే ప్రమాదముంది. రికార్డు గదుల్లో ఉన్న రికార్డులు కూడా చాలాచోట్ల చెదలు పట్టాయి. వర్షం వస్తే పలుచోట్ల రికార్డులు తడిచి ముద్దవుతున్నాయి. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డులపైన ప్లాస్టిక్ పట్టలు కప్పాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని తహసీల్దార్ల కార్యాలయాల్లోని రికార్డుల భద్రత పట్ల ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.



పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయంలో గుట్టలుగా పోసిన రికార్డులు

ప్రభుత్వ శాఖలన్నింటిలోకి ప్రధానమైనది రెవెన్యూ అని చెప్పవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించిన రికార్డులన్నీ ఈ శాఖ ఆధీనంలోనే ఉంటాయి. రీసెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్), 1బి రికార్డు, రికార్డు ఆఫ్ రైట్ (ఆర్వోఆర్), డైగ్లాట్, ఆక్రమిత భూమి రిజిస్టర్ (అడ్వర్స్ పొసెషన్), అజమాయిషీ, గ్రామకంఠం, అగ్రహారం, పసలీ, ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్, జమాబందీ, అడంగల్/పహాని వంటి రికార్డులు ఉంటాయి. వీటితో పాటు డీకేటీ భూముల రికార్డులు, నిషేధిత భూములు, నిషేధిత భూముల తొలగింపు రికార్డులు వంటివి కూడా ఉంటాయి. ఇంటి స్థలాల కేటాయింపులు రికార్డులు ఉంటాయి. ఈ రికార్డులన్నింటినీ అత్యంత భద్రంగా చూసుకోవాలి. సాధారణంగా భూములకు రికార్డులే ప్రాణం.. అవి లేకుంటే.. అనేక సమస్యలు వస్తాయి.. అక్రమార్కులు చెలరేగిపోతారు. బలం ఉన్న వాళ్లు ఎవరి భూములనైనా కాజేస్తారు. దీంతో పేదలు తీవ్రంగా నష్టపోతారు. ఈ నేపథ్యంలోనే ప్రతి తహసీల్దార్ కార్యాలయంలోనూ..రికార్డులన్నింటినీ భద్రపర్చేందుకు ఒక గదిని కేటాయిస్తారు. ఈ రికార్డు గది పర్యవేక్షణ బాధ్యత తహసీల్దార్ కార్యాలయంలో ఒక అధికారికి కేటాయిస్తారు. అయినా చాలా తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ మేరకు రికార్డులను భద్రంగా ఉంచడం లేదు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలోని కొన్ని మండల కార్యాలయాలను పరిశీలిస్తే..

- సుండుపల్లె తహసీల్దార్ కార్యాలయంలో రక్షణ కరువైంది. కొన్ని సంవత్సరాల నుంచి అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయం నడుపుతుండడంతో రికార్డులకు సరైన రక్షణ లేదు. గదికి ఉన్న కిటికీలు సక్రమంగా లేవు. రికార్డుల గదికి తాళాలు వేసినా కూడా బయట నుంచే రికార్డులు చేతికందేలా ఉన్నాయి. పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు సుండుపల్లె మండలంలో కోకొల్లలుగా ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు దొంగ పట్టాలుగా మార్చి కొందరు జేబులు నింపుకున్నారు. జగనన్న కాలనీల్లో పెద్ద సంఖ్యలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి.
- తంబళ్లపల్లెలో రికార్డులకు భద్రత లేదు. కార్యాలయం ఊరుస్తోంది. పలు గదుల్లో స్లాబ్ ఊడి పెచ్చులూడిపడుతోంది. వర్షం పడితే గదులు తడుస్తున్నాయి.
- చిట్వేలిలో రికార్డు గది భద్రంగా ఉంది. విజయవాడ నుంచి తెప్పించిన ఐరన్ సేఫ్టీ లాకర్లో రికార్డులను భద్రపరిచారు. గదిలో పవర్ సప్లై కూడా తొలగించారు.
- కురబలకోటలో రికార్డులు భద్రంగా ఉన్నాయి. రికార్డు గదిలో లేటెస్ట్‌గా కంప్యూటరైజ్డ్ లాకర్లలో రికార్డులు ఉంచారు.
- మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు గది నిర్మాణం లేక.. మొక్కలు మొలిచాయి.
- పుల్లంపేటలో రికార్డులు భద్రపరిచే గదులకు కిటికీలు, తలుపులు బాగానే ఉన్నా.. రికార్డులు ర్యాకుల్లో నిండిపోయి కింద కూడా పేర్చి ఉంచారు.
- వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదుల వద్ద మదనపల్లె సంఘటన తర్వాత ఏర్పాట్లు భద్రం చేశారు. 22ఏ తదితర రికార్డులన్నీ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలించారు. అయితే కొన్ని రికార్డులు రికార్డు గదిలో కాకుండా అధికారుల బీరువాల్లో ఉంటున్నాయి.
- చిన్నమండెం మండలంలో రికార్డు రూమ్, తహసీల్దార్ కార్యాలయానికి గత మూడు సంవత్సరాలుగా ఎలాంటి వాచ్‌మన్ లేదు. అయితే కొద్దిపాటి వర్షం వచ్చినా జల్లెడలో నీళ్ల పోసినట్లు రికార్డులు తడిచిపోతున్నాయి. దీంతో ఆ రికార్డులు తడిచిపోకుండా అధికారులు ప్లాస్టిక్ కవర్లు కప్పుతున్నారు. రికార్డు గదికి కిటికీలు సరిగ్గా పడటం లేదు. ఆ కిటికీల నుంచి ఏమైనా చేసే ప్రమాదం ఉంది.
- సంబేపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు గుట్టలుగా వేశారు. వర్షం వస్తే..గోడలు తడుస్తున్నాయి. రికార్డు గదిలో కనీసం వెలుతురు కూడా లేదు. ఇటువంటి పరిస్థితే..జిల్లాలోని చాలా తహసీల్దార్ కార్యాలయాల్లో కనిపిస్తోంది. ప్రస్తుతం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ సంఘటన నేపథ్యంలో రికార్డు గది వద్ద వీఆర్‌వోలు కాపలా ఉంటున్నారు. పోలీసు కానిస్టేబుళ్లు తహసీల్దార్ కార్యాలయాన్ని తరచూ సందర్శిస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డులను భద్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

15 రోజుల్లో నిందితులను గుర్తిస్తాం

- ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు ఆధారంగా కేసు పరిశోధిస్తున్నాం
- మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో కీలక డాక్యుమెంట్లు.. కేసు నమోదు
- మాధవరెడ్డి ఇంట్లో 500 డాక్యుమెంట్లు స్వాధీనం
- కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్



మదనపల్లె టౌన్, జూలై 29: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం ఘటనలో క్రమపద్ధతిలో దర్యాప్తు చేస్తున్నామని, ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఎస్ఎల్ నివేదిక వచ్చాక, నిందితులను నిర్ధారించుకుని అరెస్టు చేస్తామని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఐజీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం జరిగిన సమయం, తరువాత రోజు, అంతకు ముందురోజు ఆ పరిసర ప్రాంతాల్లో సెల్ టవర్ డంప్స్ తీశామన్నారు. ఇందులో 2 వేల వరకు మొబైల్‌ఫోన్ల కాల్ డేటాను పరిశీలించామన్నారు. దీంతో పాటు వాట్సప్ మెసేజ్‌ల ఐపీడీఆర్‌లను కూడా పరిశీలించామన్నారు. సబ్‌కలెక్టరేట్‌లోని సీసీ టీవీల ఫుటేజీతో పాటు, ఒక కారు డాష్‌బోర్డులోని మొబైల్ ఫుటేజిని కూడా పరిశీలించామన్నారు. ఈ ఘటనపై మదనపల్లె వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 135/2024గా కేసు నమోదు చేశామన్నారు. ప్రతి విషయాన్ని పకడ్బందీగా దర్యాప్తు చేస్తూ 15 మంది అనుమానితులను విచారించామన్నారు. ఇప్పటివరకు 52 మందిని విచారించామని, దీంతో పాటు అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని, ఈ విషయమై మరో ఎనిమిది కేసులు నమోదు చేశామన్నారు. ఆదివారం రాత్రి మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు చేసినప్పుడు కొన్ని డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నామని, మాజీ ఎమ్మెల్యేపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. మాధవరెడ్డి పరారీలో ఉన్నాడని, ఆయన ఇంట్లో సోదాలు చేసినప్పుడు 500 వరకు ఇళ్ల స్థలాలు, భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. హైదరాబాద్‌లో శశికాంత్ ఇంట్లో సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నామని, మదనపల్లె భూములకు సంబంధించినవిగా నిర్ధారణ చేయాల్సి ఉందని తెలిపారు. మాజీ మంత్రి పీఏ తుకారం ఇంట్లో కూడా సోదాలు నిర్వహించామన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఇంట్లో సోదాలు చేసినప్పుడు డాక్యుమెంట్లు దొరకలేదన్నారు. సీఐడీ అధికారుల సహకారంతో ఈ కేసును 15 ప్రత్యేక బృందాల సహకారంతో దర్యాప్తు చేస్తున్నామని, 15 రోజుల్లోపు నిందితులను అరెస్టు చేస్తామన్నారు. మాధవరెడ్డి బాధితులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని, దీనిపై కేసులు నమోదు చేస్తారా అని విలేకర్లు ప్రశ్నించగా, బాధితులు ఎవరైనా దౌర్జన్యాలకు గురైతే నేరుగా సంబంధిత పోలీసుస్టేషన్‌లలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

వరాహ రూపంలో యల్లమ్మ విహారం



కలికిరి, జూలై 29: కలికిరి జాతరలో భాగంగా సోమవారం రాత్రి యల్లమ్మ అమ్మవారు వరాహ రూపంలో పుష్పపల్లకిలో ఊరేగారు. పీడపీడల నుంచి పంటలను కాపాడి ప్రజలను అంటురోగాలు (మసూచి, కలర) బారి నుంచి కాపాడుతానని అభయమిస్తూ అమ్మవారు పట్టణ వీధుల్లో ఊరేగారు. సంప్రదాయం ప్రకారం లంకాదహనం నిర్వహించిన భక్తుల జయజయ ధ్వానాల మధ్య రంగు రంగుల పుష్పాలతో అలంకరించిన పుష్పపల్లకిని పట్టణ వీధుల్లో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీబండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సీఐ మోహన్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 200 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం పీలేరు, మదనపల్లె ఆర్టీసీ డిపోల నుంచి యల్లమ్మ జాతరకు 30 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్ కుమార్ రెడ్డి, నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి, యోగేశ్ రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సూపర్‌మార్కెట్ దగ్ధం

- సుమారు రూ.40 లక్షలు నష్టం



కాలిపోయిన సూపర్‌మార్కెట్‌లోని వస్తువులు

ఓబులవారిపల్లె, జూలై 29: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న సూపర్‌మార్కెట్‌లో సోమవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి వస్తువులతో పాటు నగదు కాలి బూడిదైంది. వివరాలిలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజమున 3 గంటల సమయంలో సూపర్‌మార్కెట్‌లో పొగలు వస్తుండటం గమనించిన పోలీసులు సూపర్‌మార్కెట్‌పైనే ఉన్న యజమాని సుదర్శన్‌రెడ్డికి తెలపడంతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. యజమాని పైనుంచి కిందకు వచ్చి గమనించేలోపు మంటలు ఎక్కువయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది 4 గంటలకు వచ్చి మంటలను అదుపు చేసేలోపు సూపర్‌మార్కెట్‌లో ఉన్న వస్తువులతో పాటు నగదు కాలి బూడిదైంది. ప్రమాదంలో రూ.4 లక్షల నగదుతో పాటు సుమారు రూ.40 లక్షల మేర నష్టం వాటిల్లిందని సూపర్‌మార్కెట్ యజమాని మల్లు సుదర్శన్‌రెడ్డి వాపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డిలు సూపర్‌మార్కెట్‌ను పరిశీలించి యజమానిని పరామర్శించారు.

పార్శిల్ కార్యాలయంలో రూ.4 లక్షలు చోరీ

- లాకర్, సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్క్‌లు ఎత్తుకెళ్లిపోయిన దుండగులు

పీలేరు, జూలై 29: లాకర్‌ను పగలగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లేందుకు సమయం పడుతుందనుకున్నారేమో కొంతమంది దుండగులు ఆదివారం రాత్రి ఏకంగా నగదు భద్రపరుచుకునే లాకర్‌నే ఎత్తుకెళ్లిపోయారు. పీలేరు-తిరుపతి మార్గంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న ప్రైవేటు పార్శిల్ సర్వీసు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు... టీటీడీ కల్యాణ మండపం పక్కన 'ఈ-కార్ట్' పేరుతో ఆన్‌లైన్ పార్శిల్ సర్వీసు కార్యాలయం ఉంది. ఎప్పటిలాగే కార్యాలయ సిబ్బంది తమ కార్యకలాపాలు ముగించుకుని ఆదివారం రాత్రి కార్యాలయానికి తాళాలు వేసుకుని వెళ్లారు. ఆ సమయంలో కార్యాలయంలో ఉన్న రూ.4 లక్షల నగదును లాకర్‌లో భద్రపరిచి వెళ్లారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం కార్యాలయం తెరిచేందుకు వచ్చిన మేనేజర్ మణికంఠకు కార్యాలయ షట్టర్ తెరిచి ఉండడం, కార్యాలయంలో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగతనం జరిగిందని అనుమానించి పీలేరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. అందులో భాగంగా కార్యాలయ సిబ్బంది నగదు భద్రపరిచిన లాకర్ మాయమైన సంగతి గుర్తించారు. దుండగులు లాకర్‌తో పాటు కార్యాలయంలోని సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్క్‌లు సైతం ఎత్తుకెళ్లిపోయారు. పోలీసులు పార్శిల్ కార్యాలయంలో వేలిముద్రలు సేకరించి విచారణ ముమ్మరం చేశారు.



పార్శిల్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

బాధితులకు అండగా ఉంటాం

- 4న బాధితులు సబ్ కలెక్టరేట్‌కు రావాలని పిలుపు
- సబ్ కలెక్టరేట్‌ను సందర్శించిన సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



మదనపల్లె అర్బన్, జూలై 29: మదనపల్లె సబ్ డివిజన్‌లోని భూబాధితులు ఆగస్టు 4వ తేదీ మదనపల్లె సబ్ కలెక్టరేట్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని సీపీఐ మీకు అండగా ఉంటుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఫైళ్లు దగ్ధమైన గదిని, కాలిన కాగితాలను, పరిసరాలను ఆయన పరిశీలించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి పోలీసులు అనుమతించకుండా ఆయనను అడ్డుకోవడంతో పోలీసులను సీపీఐ నాయకులు తోసుకుని వెళ్లి కార్యాలయంలో జరిగిన సంఘటనను పరిశీలించారు. అనంతరం ఆయన పోలీసులు అడ్డుకోవడంపై మండిపడ్డారు. అంత జాగ్రత్తగా పోలీసులు ఉంటే ఇప్పటికే నిందితులను పట్టుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ఫైళ్లు కాల్చినట్లు సంఘటనను చూస్తే అర్థం అవుతుందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులు, ప్రజలు దోపిడీకి గురయ్యారన్నారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజలను అన్ని విధాలా దోచుకున్నారని ఆరోపించారు. నిరుపేదల భూములను ఆక్రమించి వారిపైనే దౌర్జన్యం చేసి వారిపైనే కేసులు కట్టిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఫైళ్ల దహనానికి పాల్పడినవారు ఎంతటి వారైనా, ఎంతమంది ఉన్నా వారిని కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వం మారినప్పుడు తాము చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి వాటికి పాల్పడుతుంటే ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ కాంట్రాక్టర్లు, నాయకులు మాత్రం మారడం లేదన్నారు. జెండాలు, పార్టీలు మారుతాయి అయితే భూఆక్రమణదారులు, దోపిడీదారులు, మాఫియాలు మారిన ప్రభుత్వం వద్దకు చేరుతున్నారని ఆరోపించారు. చాలామంది బాధితులు భయపడి ఫిర్యాదు చేయడానికి రావడం లేదని వీరందరికీ సీపీఐ పూర్తి సహకారం ఇస్తుందని, ఎవ్వరూ భయాందోళనలకు గురికాకుండా ఆగస్టు 4వ తేదీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కాటమయ్య, రామానాయుడు, జిల్లా కార్యదర్శి సీఎల్ నరసింహులు, నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న భూబాధితులు

- వంద మందికి పైగా మాధవరెడ్డి బాధితులు
- న్యాయం కోసం సబ్ కలెక్టరేట్‌కు క్యూ



మదనపల్లె టౌన్, జూలై 29

ఒకటి కాదు రెండు కాదు..ఏకంగా వంద మందికి పైగా పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డి బాధితులు వారం రోజులుగా న్యాయం కోసం అధికారులకు విన్నవిస్తున్నారు. ఈ కోవలోనే సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్ వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మదనపల్లె, తంబళ్లపల్లె నుంచే కాకుండా పీలేరు, సదుం మండలాల నుంచి మాధవరెడ్డి బాధితులతో పాటు మదనపల్లె, తంబళ్లపల్లె మండలాలకు చెందిన వైసీపీ నాయకుల బాధితులు అర్జీలు చేత పట్టుకుని వచ్చి సబ్‌కలెక్టర్‌కు తమ గోడు వెల్లబోసుకున్నారు.

దొంగ చెక్కులు ఇచ్చాడు..



మాది పీలేరు మండలం మోడల్ కాలనీ, రొంపిచెర్ల మండలంలో మాకు నాలుగెకరాల భూమి ఉంది. దీనిలో పెద్దిరెడ్డి అనుచరుడు మాదవరెడ్డి 1.18 ఎకరాలు బలవంతంగా అతని కొడుకు పేరుతో రాయించుకున్నాడు. కోటి రూపాయలు పలికే భూమికి 9 లక్షలు ఇచ్చాడు. 5 లక్షలకు దొంగ చెక్కు ఇచ్చి మోసం చేశాడు. అదేమంటే మా మీద దౌర్జన్యం చేసి పోలీసు కేసు పెడతామని బెదిరించాడు. మాకు న్యాయం జరుగుతుందని ఆశగా ఇక్కడికి వచ్చాము.

- రఘునాథ, పీలేరు

పాసుపుస్తకాల్లో పేర్లనే మార్చేశారు..

మాది మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లె. మా తండ్రి వెంకటప్పకు 1955 సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ భూమిని అనుభవించుకుంటున్నాము. మా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెంకటరమణ వీఆర్వోకు డబ్బులిచ్చి మా నాన్న పేరు మీద ఉన్న భూమిని పాసుపుస్తకాల్లో పేర్లు మార్చి సొంతం చేసుకున్నాడు. అప్పట్లో చిత్తూరు జేసీ ఈ పట్టా రద్దు చేసినా వైసీపీ నాయకుడు మా భూమిని వదలడం లేదు. మాకు ప్రభుత్వమే న్యాయం చేయాలి.

- డి.వెంకటరమణ, దుబ్బిగానిపల్లె, మదనపల్లె మండలం

తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేశారు..



నేను 1981లో కోర్టు వేలం పాటల్లో పట్టణంలోని జడ్జి బంగళా వెనుక స్థలం కొనుగోలు చేశాను. 2022లో మాదవరెడ్డి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి మా భూమి కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మూడు కోట్ల విలువ చేసే మా స్థలంలో సగం ఆస్తిని కబ్జా చేసేశాడు. దాన్లోకి రానీయకుండా పోలీసులకు చెప్పి బెదిరించాడు. ఈ ప్రభుత్వమైనా మాకు న్యాయం చేస్తుందని అర్జీ ఇచ్చాను.

- కృష్ణకుమార్, పీటీఎం

వైసీపీ సర్పంచ్ నా భూమిని ఆక్రమించేశాడు..



మాది తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ దెయ్యాలవారిపల్లె. 1969లో ఉత్తన్న నుంచి 4.82 ఎకరాలు గుత్త దస్తావేజు రిజిస్టర్ చేసుకుని భూమి సాగు చేసుకుంటున్నాము. సేద్యం సరిగ్గా లేక మేము బెంగళూరు వెళ్లిపోయాము. మా గ్రామం వైసీపీ సర్పంచ్ మా భూమిని ఆక్రమించి, అతడి బినామీల పేరుతో పాసుపుస్తకాలు చేయించేశాడు. మా భూమిలోకి రానీయకుండా బెదిరిస్తున్నాడు. మాకు న్యాయం కావాలి.

- డి.జగన్నాథరెడ్డి, దెయ్యాలవారిపల్లె, తంబళ్లపల్లె మండలం

రూ..4 కోట్ల విలువైన భూమిలోకి అడుగు పెట్టనీయలేదు..

మదనపల్లె పట్టణం కదిరి రోడ్డులో సర్వే నెంబర్ 145/6లో 22 సెంట్ల భూమిని నా భర్త మల్లికార్జున కొనుగోలు చేశారు. ఈ స్థలంపై కన్నుపడ్డ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భార్య స్వర్ణలత, తమ్ముడు ద్వారకనాథరెడ్డి మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో మా స్థలం సబ్‌డివిజన్ ఫైలు మాయం చేశారు. ఈ స్థలంపై హక్కులేని వారి వద్ద కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని మా స్థలాన్ని కబ్జా చేశారు. నాలుగు కోట్ల విలువైన ఈ స్థలం చుట్టూ కంచె వేసి మమ్మల్ని అక్కడ అడుగు పెట్టనీయలేదు. కోర్టులో కేసు నడుస్తున్నా దౌర్జన్యంగా మా స్థలాన్ని కబ్జా చేశారు అంటూ వృద్ధ మహిళ గిరిజ కన్నీరు పెట్టుకుంది.



కన్నీటి పర్యంతమైన వృద్ధ మహిళ గిరిజ

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 29: ప్రజల సమస్యలను పరిష్కార ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలన్నారు. అందిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు నాణ్యతతో బాధ్యతాయుతంగా వంద శాతం పరిష్కరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. సమస్యలను పూర్తిగా అవగాహన చేసుకుని సమస్యపై క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణ, ఎస్‌డీసీ వెంకటసుబ్బయ్య, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలలో సమస్యలపై కాల్ సెంటర్

జిల్లాలోని 30 మండలాల పరిధిలోని పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు సమస్యలపై జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ చామకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన కాల్ సెంటర్ ఏర్పాటు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పంచాయతీలకు సంబంధించి జిల్లా స్థాయిలో పంచాయతీ అధికారి కార్యాలయంలో కాల్‌సెంటర్ 8019214517 ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమస్యలపై కాల్ చేయవచ్చునన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిలో కూడా ఇదే రకమైన కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణ, డీపీవో ధనలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

అర్ధరాత్రి దొంగలు పడ్డారు

● నిఘా వేసి వెంబడించిన అన్నదమ్ములు ● రెండు బైక్‌లు, స్కార్పియో స్వాధీనం ● పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర ముఠా



దొంగలు ఉపయోగించిన బైక్, స్కార్పియో



పోలీసులు స్వాధీనం చేసుకున్న కొత్త పల్సర్ బైక్

నంబులపూలకుంట, జూలై 29: అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆదివారం అర్ధరాత్రి హల్‌చల్ చేసింది. నలుగురు దొంగలు రెండు బైకులమీద వచ్చి నంబులపూలకుంట మండలానికి వచ్చారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో కొట్టంవారిపల్లి వద్ద వాహనాలను ఆపి.. ఓ ఇంటి వైపు వెళ్లారు. ఆ ఇంటి యజమాని గమనించి కేకలు వేశారు. దీంతో దొంగలు పారిపోయేందుకు ప్రత్నించారు. ఒక వాహనం రాయచోటి వైపు, మరో వాహనం కదిరివైపు వెళ్లాయి. ఇంటి యజమాని కుమారులు మహేష్, గణేష్ కదిరివైపు వెళుతున్నవారిని బైకుమీద వెంబడించారు. అది గమనించిన దొంగలు, గాండ్లపెంట మండలం చామలగొంది రోడ్డు సమీపంలో వాహనాన్ని వదిలి పరుగులు తీశారు. వారు వదిలి వెళ్లిన బైకు వద్ద సోమవారం తెల్లవారుజాము వరకు మహేష్, గణేష్ మాటు వేశారు. తెల్లవారు జామున ఏపీ 03 బీఎఫ్ 1746 నంబరుగల స్కార్పియో వాహనం అక్కడికి వచ్చింది. అందులో ఉన్న వ్యక్తులు దొంగలు వదిలివెళ్లిన బైకును తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. మహేష్, గణేష్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో దొంగలు స్కార్పియో ఎక్కి తప్పించుకుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని సోదరులిద్దరూ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు స్పందించి అదే మండలంలోని తిమ్మమ్మమర్రిను హైస్కూల్ వద్ద ఉన్న జనసేన మండల అధ్యక్షుడు చౌదరి సమాచారం అందించారు. వెంటనే ఆయన గ్రామస్థులతో కలిసి ఓ ఎక్స్‌కవేటర్‌ను, కొన్ని వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టించారు. స్కార్పియో రాగానే అందులో ఉన్న ముగ్గురు దొంగలను పట్టుకునేందుకు గ్రామస్థులు ప్రయత్నించారు. వారిలో ఇద్దరు పారిపోగా, డ్రైవర్‌ను దొరకబుచ్చుకున్నారు. డ్రైవర్‌ను, స్కార్పియోను పోలీసులకు అప్పగించారు. స్కార్పియోలో ఇంటర్‌నెట్ పరికరాలు, మూడుకొత్త మొబైల్ ఫోన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించి.. తప్పించుకున్న ఇద్దరిని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పట్టుకున్నారు. ఆ తరువాత మరో పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పాత నేరస్థులే..

పోలీసులకు పట్టుబడిన స్కార్పియో వాహనం అన్నమయ్య జిల్లా తూముకుంట దిగువమూలకు చెందిన యోగీశ్వర్‌నాయుడు పేరిట ఉంది. వాహనాన్ని తానే నడుపుతుంటారు. పోలీసులకు పట్టుబడింది ఇతనే. మిగిలిన నలుగురు బైక్‌ల మీద రాగా.. వారిని కవర్ చేస్తూ యోగీశ్వర్ నాయుడు తన స్కార్పియోలో వచ్చాడు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకు (ఏపీ 40 బీపీ6889) తూర్పు గోదావరి జిల్లా రాజానగరం వారి జయప్రకాష్ పేరిట ఉంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు పట్టుకున్న మరో ఇద్దరు కర్ణాటకవాసులని తెలిసింది. ఈ ముఠా సూత్రధారి చిత్తూరు జిల్లావాసి అని పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడినవారిపై ఎర్రచందనం కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. సబ్ జైళ్లలో ఏర్పడిన పరిచయాలతో వీరు ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలు

పోలీసుల అదుపులో ఉన్న దొంగల ముఠా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ముఠా సభ్యుల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లలో సిమ్ కార్డులు లేవని, ఇంటర్‌నెట్‌తో అన్ని మొబైల్స్ అనుసంధానం చేసుకున్నారని సమాచారం. స్కార్పియోలో ఉన్న యోగీశ్వర్ నాయకుడుకు వీరి కదలికలు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారానే తెలుస్తాయి. వాటి ఆధారంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే రంగంలోకి దిగి రక్షించేందుకు రంగంలోకి దిగేవాడు. ఇతని వద్ద ఉన్న పరికరాల ఆధారంగానే పారిపోయిన ఇద్దరిని పోలీసులు వెంటనే పట్టుకోగలిగారు.

నగదు.. ఆభరణాలు..

పట్టుబడిన స్కార్పియోలో రూ.10 వేలు నగదు, ఒక చేతి గడియారం, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, మూడు జతల అద్దాలు, వైఫై మోడెం, సెల్‌ఫోన్‌లు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా దువ్వూరులో శనివారం రాత్రి ఓ బైక్‌ను చోరీ చేసి తెచ్చినట్లు సమచారం. పోలీసులకు పట్టుబడ్డ పల్సర్ వాహనం కొనుగోలు చేసి దాదాపు 20 రోజులై ఉంటుంది. ఇంకా నంబర్ కూడా రాలేదు.

గంజాయి విక్రేతలపై మెరుపుదాడులు

● 6.6 కిలోల గంజాయి స్వాధీనం ● నలుగురు అరెస్టు

కడప (క్రైం), జూలై 29: జిల్లాలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలతో కూడిన డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో సోమవారం మెరుపు దాడులు నిర్వహించారు. దాడుల్లో 6.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలో డీఎస్‌ఆర్ మిల్ సమీపంలో పుల్లయ్య అనే నిందితున్ని అరెస్టు చేసి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసు కున్నామన్నారు. కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జనార్ధన్, ఓబులేసు అనే నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, అలాగే రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జగదీశ్ అనే నిందితున్ని అరెస్టు చేసి 1100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. ప్రజలు ఎక్కడైనా గంజాయికి సంబంధించిన సమాచారాన్ని 14500 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు తమ వంతు సామాజిక బాధ్యతగా పోలీసు శాఖకు సహకరించాలని తెలిపారు.

మద్యంషాపులో రూ.4.88 లక్షలు చోరీ

అట్లూరు, జూలై 29 : మండలంలోని రెడ్డిపల్లె వద్ద ఉన్న ప్రభుత్వ మద్యం షాపులో సోమవారం తెల్లవారుజామున రూ.4.88 లక్షలు చోరీ జరిగినట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు. మద్యం షాపు పక్కనే ఉన్న హోటల్ నిర్వాహకులు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. షాపులో ఉన్న లాకరును బయటకు తీసుకెళ్లి... అందులో ఉన్న రూ.4.88 లక్షలు నగదు చోరీ చేశారని తెలిపారు. కడప ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు మద్యం షాపు సూపర్‌వైజరు, సేల్స్‌మ్యాన్‌లు, వాచ్‌మెన్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సిబ్బంది పైనే అనుమానం వ్యక్తం చేస్తూ.. చోరీకి గురైన రూ.4.88 లక్షలు సిబ్బందే చెల్లించాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

సికెదిన్నె, జూలై 29: అత్తవారింటి వేధింపులు తట్టుకోలేక ఆదివారం రాత్రి సయ్యద్ అఫ్రిన్‌భాను (26) అనే మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ శివశంకర్‌నాయక్ వివరాల మేరకు.. మండలంలోని బోడెద్దులపల్లె గ్రామానికి చెందిన ఇక్బాల్‌బాష, అఫ్రిన్‌భానులకు 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, ఒక పాప ఉన్నారు. అదనపు కట్నం కోసం అత్తవారింటిలో వేధిస్తుండడంతో ఆదివారం రాత్రి ఇంటిలోని ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని చనిపోయిందన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడికోసం.. కొట్టి చంపాడు



మృతి చెందిన వెంకటరెడ్డి

నందలూరు, జూలై 29: మండలంలోని ఎర్రచెరువుపల్లెలో ఆదివారం రాత్రి ఇరుగు పొరుగు వారి మధ్య జరిగిన గొడవ హత్యకు దారి తీసింది. సాతుపల్లి వెంకటరెడ్డి తన పెంపుడు కోడి కనిపించడం లేదని వెతుకుతూ.. దానిని దొంగలించిన వారిని వదిలి పెట్టనని తిట్టాడు. పొరుగున ఉండే నాగప్రతాప్‌రెడ్డి ఆగ్రహించి మంచితనంగా వెంకటరెడ్డిని ఇంటి దగ్గరికి రమ్మని.. మీ కోడి మా ఇంట్లోనే ఉందని నమ్మబలికి.. ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో లైట్లు ఆఫ్‌చేసి అతనిని విచక్షణ రహితంగా కొట్టారు. అనంతరం నాగ్రపతాప్‌రెడ్డి వీధిలోకి వచ్చి సత్తుపల్లి వెంకటరెడ్డిని మా ఇంటి ఆవరణలో కొట్టి పడేశాను మీరు తెసుకెళ్లండి అని ఇరుగు పొరుగు వారికి తెలుపుతూ అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. గ్రామస్థులు సంఘటనా స్థలికి వెళ్లేసరికి రక్తపుమడుగులో వెంకటరెడ్డి ఉన్నాడు. వెంటనే గాయపడిన వ్యక్తిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో మృతి చెందినట్లు సమాచారం. దాడి చేసిన నాగ ప్రతాప్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు నందలూరు ఎస్ఐ మహ్మద్ అబ్దుల్‌జహీర్ తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

రూరల్ సీఐ కార్యాలయంలో అగ్నిప్రమాదం

బద్వేలు రూరల్, జూలై 29 : స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని రూరల్ సీఐ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కార్యాలయంలో ఉన్న సీపీవో సిస్టంతో పాటు ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. కేసులకు సంబంధించిన కీలక ఫైళ్లన్నీ బీరువాలో భద్రంగా ఉన్నట్లు రూరల్ సీఐ విక్రమసింహ తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించండి : ఎస్పీ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ

రాయచోటిటౌన్, జూలై 29: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 40 మంది ఫిర్యాదు దారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడే వారి సమస్యలను అడిగి తెలుసుకుని.. ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అలాగే జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే అర్జీలను పరిశీలించి చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్‌సిస్టం) కార్యక్రమానికి సోమవారం మొత్తం 40 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని ఆయా పోలీసు స్టేషన్లకు పంపించి.. విచారించి అనంతరం చట్ట పరిధిలో పరిష్కరిస్తామన్నారు. కాగా, రైల్వేకోడూరుకు చెందిన క్రిష్ణారెడ్డి అనే రైతు తన భూమిని ఆక్రమించారని ఎస్పీకి ఫిర్యాదు చేయగా.. రాజంపేట డీఎస్పీకి ఫార్వర్డ్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయం తనిఖీ



జిల్లా పోలీసు కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కర్నూల్ రేంజ్ డీఐజీ

రాయచోటిటౌన్, జూలై 29: అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయాన్ని సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయనకు జిల్లా కేంద్రంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పూలమొక్కలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం డీఐజీ జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి పోలీసు సిబ్బందికి, అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందుగా జిల్లా ఆర్మ్ పోలీసు సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లాఅండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే అసాంఘిక శక్తులతో పాటు ఎర్రచందన అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

పరిశోధన ఫలాలు అందించాలి



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ సుమతి

సికెదిన్నె, జూలై 29: శాస్త్రవేత్తలు రైతులకు పరిశోధన ఫలాలు అందించాలని సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రయోగాత్మకంగా సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందించి వారికి ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. దిగుబడులు పెంచేందుకు శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయని.. అందుకు శాస్త్రవేత్తలు పరిశోధనల్లో కనుగొన్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారి, శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శిల్పకళ, ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరి, మహేష్, కృష్ణప్రియ, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు పెండింగ్ లేకుండా చేపట్టాలి



కడప అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ శివరామ్

కడప(కలెక్టరేట్), జూలై 29: రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఏ రోజు కారోజు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని.. రేపు మాపు అంటూ తిప్పొద్దని... ఆలస్యమైనా సరే సాయంత్రం వేళల్లో ఆఫీసుల్లో ఉండి రిజిస్ట్రేషన్లు పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శివరామ్ ఆదేశించారు. సోమవారం కడప అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఆయన విజిట్ చేశారు.

ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని పలు రికార్డుల నిర్వహణను పరిశీలించారు. భూము లు, స్థలాలు క్రయ, విక్రయాలు జరిపే వినియోగదారుల సమ స్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజల పట్ల గౌరవ మర్యాదలతో నడుచుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. మొక్కుబడిగా విధుల్లో ఉండకూడదని హెచ్చరించారు. అనంతరం రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇబ్బందులను డీఐజీకి డాక్యుమెంట్ రైటర్లు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

248 పరుగుల ఆధిక్యతలో కడప జట్టు

● 65 పరుగుల వెనుకంజలో చిత్తూరు



147 పరుగులు చేసిన గురుచరణ్ (కడప)



119 పరుగులు చేసిన యువన్ (విశాఖ)

కడప (స్పోర్ట్స్) జూలై 29 : ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నీలో భాగంగా కడప నగర పరిధిలో జరుగుతున్న వివిధ జట్ల క్రికెట్ మ్యాచ్‌లలో ఆటకు రెండవ రోజైన సోమవారం కడప జట్టు 248 పరుగుల ఆదిక్యతతో ముందుకు సాగుతోంది. మరో మ్యాచ్‌లో 65 పరుగుల వెనుకంజలో చిత్తూరు జట్టు ఎదురీదుతోంది. ఇదిలా వుండగా మరో మ్యాచ్‌లో విజయానికి 356 పరుగుల దూరంలో వెస్ట్ గోదావరి జట్టు ఎదురీదుతోంది. వివరాలిలా...

కడప నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ స్టేడియంలో క్రిష్ణా-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో క్రిష్ణా జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి (ఆదివారం) 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 370 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఓవర్‌నైట్ స్కోర్ 370 పరుగులతో రెండవరోజైన సోమవారం తిరిగి ఆట ప్రారంభించిన క్రిష్ణా జట్టు 7.2 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి మొత్తంగా 97.2 ఓవర్లలో 396 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ జట్టులోని గీత్ 103 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్ సాయి చరణ్ 5 వికెట్లు సాధించారు. ఇదిలావుండగా బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 81 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 331 పరుగులతో ధీటుగా ఆడుతోంది. ఇందులో లోహిత్ లక్ష్మీనారాయణ 75 పరుగులు చేయగా.. చరణ్‌జిత్ 60 పరుగులు, గౌతమ్ క్రిష్ణ 93 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు ఇంకా 65 పరుగుల వెనుకంజలో వుంది. మంగళవారం ఆటకు చివరిరోజు

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో శ్రీకాకుళం-కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 204 పరుగులు చే సిన సంగతి తెలిసిందే. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. కాగా ఓవర్‌నైట్ స్కోర్ 132 పరుగులతో తిరిగి రెండవరోజున బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 116 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 452 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో రోహిత్ 82 పరుగులు చేయగా.. గురుచరణ్ 147 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేశారు. దీంతో కడప జట్టు 248 పరుగుల ఆధిక్యతలో నిలిచింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో విశాఖ, వెస్ట్ గోదావరి జట్ల మధ్యసాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విశాఖ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. ఇందుకు బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌గోదావరి జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 123 పరుగులతో రెండవరోజైన సోమవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి ఎట్టకేలకు మరో 2.3 ఓవర్లపాటు క్రీజ్‌లో నిలిచి 8 పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీంతో మొత్తం 131 పరుగులు చేసినట్లయింది. ఆ మేరకు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 67.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 366 పరుగులు చేసింది. ఇందులో యశ్వంత్ 118 పరుగులు, యువన్ 119 పరుగులు చేయడం విశేషం. దీంతో ఆ జట్టు తన రెండు ఇన్నింగ్స్‌లో ఏకంగా 537 పరుగులు చేసినట్లయింది. ఇందుకు ప్రతిగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులతో నిలిచింది. విజయానికి ఇంకా 356 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. ఆటకు మంగళవారం చివరిరోజు.

ఏఎఫ్‌ఏయూ సెమిస్టరుపరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వైస్‌చాన్సలర్

కడప (ఎడ్యుకేషన్), జూలై 29: డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్‌అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీలో కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, హైస్కూలు ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన రెండో సెమిస్టరు, ఆర్కిటెక్చర్‌కు సంబంధించి 4, 6, 8 సెమిస్టరు రెగ్యులర్ పరీక్ష ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్, రిజిస్ట్రారు ప్రొఫెసరు రాజేశ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. సోమవారం యూనివర్శిటీలో పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలను వెల్లడించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ నాలుగో సెమిస్టరు ఫలితాల్లో 93 శాతం, ఆరవ సెమిస్టరు 60శాతం, 8వ సెమిస్టరు 75వ శాతం ఉత్తీర్ణత సాధించా రన్నారు. కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, స్కూలు ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన రెండో సెమి స్టరు ఫలితాల్లో 70 శాతం మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. పరీక్ష ఫలితాలు కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచనట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్రారెడ్డి, విజయ్‌ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మి ప్రవళ్లిక పాల్గొన్నారు.

ఏఎఫ్‌ఏయూ ప్రవేశాలకు విశేష స్పందన

డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వ విద్యాలయంలో ప్రవేశాలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. ఏడీ సెట్ కమిటీ చైర్మన్, కన్వీనరు, ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ ఆధ్వర్యంలో కౌన్సెల్ ప్రక్రియ జరిగింది. ఏడీ సెట్ 2024కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించారు. క్యాంపస్‌లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కౌన్సెలింగ్ చేశారు. సోమవారం ఒక్కరోజే 50 మందికి పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు. డీఎఫ్‌ఏలో పెయింటింగ్, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, శిల్పం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో వైఏయూ అసిస్టెంటు ప్రొఫెసరు సుబ్బరా యు డు, ప్రొఫెసరు ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు విజయలక్ష్మి, రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో రాణించాలి

● అన్ని మండలాల్లో విద్యార్థులకు తిథి భోజనం

రాజంపేట, జూలై 29: విద్యార్థులు దాతలు ఇస్తున్న సహాయ సహకారాలు అందిపుచ్చుకుని పోటీ ప్రపంచంలో ముందుడి తమ తల్లిదండ్రులకు, గురువులకు, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. సోమవారం డీబీఎస్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజంపేట మండల విద్యాశాఖ అధికారులు రఘునాథరాజు, సుబ్బరాయుడులు విచ్చేసి విద్యార్థిని విద్యార్థులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ రాజంపేట అధ్యక్షుడు నరసింహరాజు, షేక్ అబ్దుల్లా పాఠశాల ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, గీతాదేవి, మాదాలస తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్లో

ప్రజా భాగస్వామ్యంతో చేసే ఏ పని అయినా మంచి ఫలితాలు ఇస్తాయని ఉర్దూ స్కూలు కమిటీ సభ్యులు గండికోట గుల్జార్‌బాషా తెలిపారు. సోమవారం ఉర్దూ పాఠశాలలో దాతల సౌజన్యంతో ఒకరోజు శుభ భోజనాన్ని విద్యార్థులకు అందించారు. ఎంపీహెచ్‌ఎస్ రాజంపేట నియోజకవర్గ అధ్యక్షుడు గుల్జార్‌బాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం, సభ్యులు ఇనాయత్, అబ్దుల్లా, మహిళా సభ్యులు మస్తానీ, సాహేరా, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం జడ్పీ హైస్కూల్లో సోమవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తిథి భోజనం ఏర్పాటు చేశామని హెడ్మాస్టర్ శ్రీరాములు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది దాతల సహాయంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిథి భోజనం ఏర్పాటు చేశామని విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో తిథి భోజనం వడ్డించామని ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఈ మేరకు దాత రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ మధ్యాహ్నం భోజనంలో విద్యార్థులకు అరటిపండు, పాయసం వడ్డించామన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు మాదాసు నరసింహ, బొంతల నాగేశ్వరరావు, మన్మథరాజా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండలంలోని మల్లూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యా వార్షికోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న ఆధ్వర్యంలో దాతల సహకారంతో తిథి భోజనం విద్యార్థులకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శివనాయక్ మాట్లాడారు. దాతలు స్కూల్ కమిటీ ఛైర్మన్ బయారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, చింతా వెంకట్రామిరెడ్డి, ఎర్రబాషా, సిద్దయ్య, బెల్లం క్రిష్ణారెడ్డి, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంబేపల్లె: మండల పరిధిలో పలు పాఠశాలల్లో సోమవారం దాతల సహకారంతో విద్యార్థులకు తిథి భోజనం సోమవారం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజులు, సంబేపల్లె ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, పెద్దబంగంపల్లి ప్రధానోపాధ్యాయుడు చక్రపాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాపురం: అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని నీలకంఠ్రావుపేట జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల ఛైర్మన్ సలీం అన్నారు. సోమవారం పాఠశాల కమిటీ ఛైర్మన్ సలీం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. యడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం పెట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే పెన్షన్లు

● మున్సిపల్ కమిషనర్ రాంబాబు

రాజంపేట, జూలై 29: పెన్షన్‌దారుల ఇంటివద్దకే అధికారులు వచ్చి పెన్షన్ పంపిణీ చేయనున్నారని మున్సిపల్ కమిషనర్ రాంబాబు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డులకు సంబంధించి పెన్షన్‌దారులు సచివాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులే తమ ఇళ్ల వద్దకు వచ్చి పెన్షన్ పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా బీటీఏ ఆవిర్భావ దినోత్సవం

వీరబల్లి, జూలై 29: బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం వీరబల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈవో క్రిష్టయ్య ఈ కార్యక్రమానికి హాజరై శిక్షా సప్తాహ్ చివరి రోజు తిథి భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీటీఏ జిల్లా ట్రెజరర్ గోపాల్‌దాస్, రాజశేఖర్, నాగమునినాయక్, రాచరాయుడు, కబీర్‌బాషా, ఖాదర్‌వలి, ఇర్షాద్, సతీశ్‌బాబు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

రాజంపేట టౌన్, జూలై 29: విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి హర్ష సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థలో నెలకొన్న పలు సమస్యలపై డీఈఓ అనురాధకు విన్నవించారు. రాజంపేట మండల పరిధిలో కూడా పలు సమస్యలపై ఎంఈవో కార్యాలయంలో ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాడు-నేడు పనుల్లో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులు అందుబాటులో ఉండాలి

సంబేపల్లె, జూలై 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల బట్వాడా కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులందరూ ఆగస్టు 1న అందుబాటులో ఉండాలని ఎంపీడీవో నిర్మలాదేవి సోమవారం తెలియజేశారు. సెర్ప్ సీఈవో ఆదేశాల మేరకు అందుబాటులో ఉండే విధంగా గ్రామంలో బహిరంగ ప్రదేశాల్లో ఆడియో రికార్డింగ్, దండోరా, టామ్ టామ్ వేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది అందరూ ఉదయం 6 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేపడతారని తెలియజేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రామాపురం, జూలై 29: ఈవోపీఆర్‌డీ ఉషారాణి ఆదేశాల మేరకు మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ సర్పంచ్ మునీర్‌బాషా, పంచాయతీ సెక్రటరీ సూరం సంజీవరెడ్డిల ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. సరస్వతిపల్లె పంచాయతీలోని ప్రతి గ్రామంలో, వీధుల్లో ఉన్న చెత్తాచెదారం, ఊరు ఆనుకొని ఉన్న దిబ్బలు, కంపచెట్లు తొలగించి గుంతలు ఉండే చోట బ్లీచింగ్, సున్నం చల్లించారు. కంప పొదలను ఎక్సకవేటర్ సహాయంతో తొలగించారు.

కార్పొరేట్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోండి: ఏబీవీపీ

రాయచోటిటౌన్, జూలై 29: విద్యతో వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాయచోటి నగర అధ్యక్షుడు విజయ్, షాజహాన్, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రామాపురం, జూలై 29: మండలంలోని రాచపల్లి గ్రామం గంగనేరులో గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ప్రత్యేక నిధులతో ఆ గ్రామానికి బోరు వేయించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరులు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి సోమవారం మండల పర్యటనలో భాగంగా గంగనేరులో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు వద్ద కొబ్బరికాయ కొట్టి బోరును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా బోర్లు వేయించి నీటి ఎద్దడిని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ఏజీ గార్డెన్‌లోని సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి(కలెక్టరేట్), జూలై 29: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఏజీ గార్డెన్ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుక్కే విశ్వనాథనాయక్ అన్నారు. ఏజీ గార్డెన్ ప్రజలతో కలసి సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ కాలనీ ఏర్పాటు చేసి దాదాపు 15 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వారు దుయ్యబట్టారు. ఇక్కడ దాదాపు 3 వేల మంది జనాబా కలిగిన ప్రాంతం అయినప్పటికి సీసీ రోడ్లు, తాగునీరు, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

సుండుపల్లె, జూలై 29: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హుస్సేన్ తెలిపారు. సోమవారం మండలంలోని పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని రెవెన్యూశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి

రాజంపేటటౌన్, జూలై 29: హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సబ్‌కలెక్టర్ వైఖోమ్ నదియాదేవికి పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థి సంఘాల నేతలు నేతి నాగేశ్వర, రమణలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో విద్యార్థులు సరైన వసతులు లేక విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని తెలిపారు. గత పదేళ్ల నుంచి అద్దె భవనాల్లోనే ప్రభుత్వ హాస్టళ్లు ఉంటున్నాయని, ప్రభుత్వ హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న పలు బిల్లులను వెంటనే మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చెంగయ్య, సంతోష్, వినయ్ పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

గాలేరు - నగరి నీటిని అందించాలి

చిట్వేలి, జూలై 29: రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు గాలేరు- నగరి ప్రాజెక్టును పూర్తి చేసి నీరందించాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మలిశెట్టి రాహుల్ విజ్ఞప్తి చేశారు. సోమవారం వెంకటరాజుపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణంగా ఈ నియోజకవర్గాల్లో అక్టోబరు, నవంబరు నెలల్లో వర్షాలు పడతాయని, జూన్, జూలై నెలల నుంచి ఈ ప్రాంతంలో సాగు, తాగునీటికి కొరత ఏర్పడుతుందన్నారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పింఛన్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం రెండింటిని పరిశీలించి అమలు చేయాలని రైతు నాయకులు రాహుల్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మలిశెట్టి వెంకటయ్య, నారాయణ, వెంకటసుబ్బయ్య కె.వెంకటయ్య, చలపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నూతన పద్ధతులతో మంచి దిగుబడి

● వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ సుమతి

రామాపురం, జూలై 29: నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి పెంపొందించవచ్చని సహాయ సంచాలకురాలు డాక్టర్ సుమతి అన్నారు. మండలంలోని గోపగుడిపల్లె గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు పొలంలో సోమవారం కేవీకే ఊటుకూరు కడప ద్వారా జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా వేరుశనగలు సామూహిక ప్రథమ శ్రేణి క్షేత్ర ప్రదర్శనలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త వీరయ్య, తెగుళ్ల విభాగం డాక్టర్ విశ్వనాథ్, శాస్త్రవేత్త సస్యరక్షణ విభాగం తిరుపతి డాక్టర్ శిల్పకళ, డాక్టర్ సాయి, మహేశ్వరి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఘనంగా వీరభద్రుడి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, జూలై 29: దక్షిణ కాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడు ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవంపై ఆలయం చుట్టూ మాఢవీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు.



పల్లకీ ఉత్సవంలో భద్రకాళీ సమేత వీరభద్రుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సిద్దవటం, జూలై 29: మండలం కడప - చెన్నై రహదారి మాధవరం గ్రామ పంచాయతి బంగారుపేట వద్ద గుండ్ల కుచేలయ్య(68) అనేవ్యక్తి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు విచారణ చేపట్టారు.

భూములను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టండి

రాజంపేట, జూలై 29: దళితులకు దక్కాల్సిన ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని సోమవారం సబ్‌కలెక్టర్ వైఖోమ్ నదియాదేవికి రేపూరి శంకరయ్య ఆధ్వర్యంలో దళితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెనగలూరు మండలం సిద్దారం గ్రామ పంచాయతీ సర్వేనంబరు-407లో దాదాపు 6 ఎకరాల పైబడిన కోడూరు మండలం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జడ్పీహెచ్‌డీసీ ప్రభుత్వ భూమి సర్వేనంబరు 23, 67లో దాదాపు 10 ఎకరాలు నిరుపేద దళిత గిరిజనులకు దక్కాల్సిన ప్రభుత్వ భూమిని కొందరు అనుభవిస్తున్నారని, వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. వారిలో పందుగోల మణి, సామ గంగయ్య, తిప్పన ప్రసాద్ పాల్గొన్నారు.

99 శాతం పూర్తి చేయాలి

పుల్లంపేట, జూలై 29: మండలంలో 11 సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ ఆగస్టు 1వ తేదీకే 99 శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో నరసింహమూర్తి పంచాయతి కార్యదర్శులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పెంచలయ్య, పంచాయతి కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలి

● భవన నిర్మాణ కార్మికులు

రాజంపేటటౌన్, జూలై 29: ఉచిత ఇసుకను వెంటనే అందుబాటులోకి తేవాలని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవికి భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. సోమవారం పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు కార్యాలయం ఎదుట బైఠాయించి ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరి ఎంఎస్ రాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి సికిందర్, పి.సుబ్రమణ్యం, నరసింహ, రమణ, బ్రహ్మయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పదోన్నతులను చేపట్టాలి

● టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యుడు శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, జూలై 29: రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పోస్టులను ఎస్‌జీటీలతో భర్తీ చేయాలని, స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులను నెలవారిగా చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌టీఏ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంకా చాలా పాఠశాలల్లో ఖాళీలు ఉన్నందున పాఠ్యాంశాల బోధన, విద్యా ప్రమాణాల పెంపు కష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, నరసింహారెడ్డి, కులశేఖర్‌రెడ్డి, ఫకీర్, నాగేంద్రబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

అభివృద్ధికి సహకరించండి : ఎంపీపీ

రామాపురం, జూలై 29: మండల అభివృద్ధికి సభ్యులందరూ, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమష్టిగా కృషి చేసి అభివృద్ధి చేయాలని ఎంపీపీ గడికోట విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో సోమవారం మండలాధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలతో పాటు మండల కేంద్రంలో అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని ఆమె కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, డాక్టర్ వినోద్‌కుమార్, ఎంఈవో జయచంద్రలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రమణ, మండల ఉపాధ్యక్షుడు రవి శంకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రభాకర్, ఎంఈవో జయచంద్రుడు, రామకృష్ణుడు, ఏవో నాగమణి, చంద్రఓబుల్‌రెడ్డి, ఏపీవో సురేంద్రనాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామశాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

సంబేపల్లె, జూలై 29: మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు సంబేపల్లె మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా పాలెంగడ్డ రోడ్డు నుంచి నల్లగంగమ్మ దేవస్థానం వరకు రూ.1.26 కోట్లతో పంచాయతీరాజ్ నిధుల కింద సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి డీఈ వెంకటరెడ్డి, జేఈ మాబుసాహెబ్ పనులను మార్కింగ్ ఇచ్చి ప్రారంభించారు. సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని తెలియజేశారు. ఆలయం చుట్టూ అదనంగా సీసీ రోడ్లు వేసేందుకు మరో రూ.70 లక్షలతో ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొండారెడ్డి, టీడీపీ నాయకులు వేణు, రెడ్డయ్య, సూరి, సుండుపల్లె రెడ్డెయ్య, సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

టీడీపీ నేతలతో సుగవాసి చర్చలు

రాజంపేటటౌన్, జూలై 29: రాజంపేటలో పలు సమస్యలపై సోమవారం టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆరా తీశారు. నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రధానంగా రోడ్ల సమస్యను, నీటి సమస్యను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయా సమస్యల గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు బాపనయ్యనాయుడు, మేకా నరసింహులు, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, లీగల్‌సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రాజంపేట పట్టణ టీడీపీ నాయకులు గంప శివ, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, అగ్రహారం నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సుగవాసి బాలసుబ్రమణ్యంతో భేటీ అయిన టీడీపీ నాయకులు

చెత్తకుప్ప తొలగింపు

పెనగలూరు, జూలై 29: మండల కేంద్రమైన రాజంపేట, పెనగలూరు ఆర్ అండ్‌బీ రోడ్డుపక్కనే ఉన్న బస్టాప్ సమీపంలో స్థానికులు వేస్తున్న చెత్తకుప్పను సోమవారం పెనగలూరు గ్రామ కార్యదర్శి సుబ్బరాయుడు గ్రీన్ అంబాసిడర్ల ద్వారా తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'చెత్త కంపును భరించలేకున్నాం' అనే వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన గ్రామ కార్యదర్శి గ్రీన్ అంబాసిడర్లను పురమాయించి చెత్తకుప్పను శుభ్రం చేయించి దోమలు వ్యాపించకుండా బ్లీచింగ్ పౌడర్‌ను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంగళవారం అక్కడ చెత్త వేసే వారందరికి నోటీసులు అందజేస్తామని తెలిపారు.



చెత్తకుప్పను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి

సుండుపల్లె, జూలై 29: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ఒక వరమని ఎంఈఓ వెంకటేశ్ తెలిపారు. సోమవారం మండలంలోని తిమ్మసముద్రం ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. పదవీ విరమణ పొందిన తర్వాత ప్రశాంతంగా జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రవీంద్రనాయక్, ఎస్టీయూ నాయకులు ఆరీఫుల్లా, ప్రధానోపాధ్యాయుడు జయన్న, హరికుమార్, నేతలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

వీరబల్లి, జూలై 29: ప్రజాప్రతినిధులు.. రాజకీయాలు, కక్షలు మానాలని, సమన్వయంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి జరిగేందుకు కృషి చేస్తామని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మారిందని ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించి అభివృద్ధికి కృషి చేసేలా చూడాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి సమాచారాన్ని సభ్యులకు వివరించారు. నీటిసమస్యపై మట్లి, వీరబల్లి, తాటిగుంటపల్లి, సానిపాయి సర్పంచులు నాగార్జునాచారి, గోపీనాథరెడ్డి, నేతి ఆంజనేయులు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో చేతిపంపులు మరమ్మత్తులకు నోచుకోలేదని తెలిపారు. ఇన్‌చార్జి జేఈ కృష్ణయ్య మాట్లాడుతూ వర్షాలు కురవనందున గ్రామాల్లో నీటి సమస్య తలెత్తుతుందని, ట్యాంకర్‌తో నీటి సరఫరాకు మండల కమిటీ ఆమోదం తెలపాలన్నారు. అనంతరం హౌసింగ్ ఏఈ వెంకటేశ్, వైద్యాధికారి జియావుల్లా మాట్లాడారు. ఏవో స్వాతి, ఎంఈవో కృష్ణయ్య, ఏపీయం ఖాదర్‌వలి, ఏపీవో నాగరాజు, విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ కేశవ్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

రాజంపేట, జూలై 29: రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవిని రాజంపేట బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజంపేటలో నెలకొన్న భూ సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సునీత నారాయణ, మైనార్టీ నాయకులు షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



అర్జునా.. ఫల్గుణా

చిత్తూరు సమీపం మురకంబట్టులో మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవార ఉదయం ఆదికేశవులు సర్కిల్‌లో తపస్మాన్ కార్యక్రమం నిర్వహించారు. తమ కోరికలు నెరవేరాలని భక్తులు తపస్మాను చుట్టూ వరపడ్డారు. తపస్మానుపై నుంచి అర్జున పాత్రధారి విసిరే నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు.

- చిత్తూరు కల్చరల్

తపస్మాన్‌పై నుంచి అర్జున పాత్రధారి విసిరే నిమ్మకాయల కోసం..





తపస్మాను చుట్టూ వరపడిన భక్తులు



చిత్తూరులోని చెంగల్రాయకొండ సుబ్రమణ్యేశ్వరాలయం వద్ద..

హరోం హర

ఆడికృత్తిక సందర్భంగా సోమవారం జిల్లాలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. పలువురు భక్తులు ఇళ్ల నుంచి కావళ్లతో వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటు చూసినా పసుపు దుస్తులు ధరించి.. కావళ్లు మోసుకెళుతున్న భక్తులే కనిపించారు.

- చిత్తూరు కల్చరల్



పుంగనూరులో పూలకావళ్లు తీసుకెళుతున్న భక్తులు

క్వారీపై లక్ష్మీపురంవాసుల దాడి

కుప్పం, జూలై 29: గుడుపల్లె మండలం గుత్తార్లపల్లె వద్ద ఉన్న ఆర్.ఆర్. గ్రానైట్స్ యాజమాన్యానికి చెందిన క్వారీపై కుప్పం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొందరు సోమవారం ఉదయం దాడిచేశారు. క్వారీలో పని చేస్తున్న కార్మికులను తరిమికొట్టి అక్కడి సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. అక్కడున్న గ్రానైట్ బండలను కంటైనర్లలో తరలించుకుని వెళ్లినట్లు క్వారీలోని కార్మికులు ఆరోపిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి, గుంపును చెదరగొట్టి తరిమేశారు. దీనిపై కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్‌ను వివరణ కోరగా.. వడ్డెర సంఘానికి చెందిన వ్యక్తులు కొందరు క్వారీ దగ్గరకు వెళ్లి, స్థానికులైన తమకు పని ఎందుకు ఇవ్వలేదని అక్కడి ఉద్యోగులను నిలదీసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొంత ఘర్షణ జరిగిందన్నారు. ఇరువర్గాలతో మాట్లాడుతున్నామని తెలిపారు.

లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై నిఘా

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29: జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో చాలా వ్యత్యాసం ఉందని,ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక, తమిళనాడులకు సరిహద్దులో జిల్లా ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు, డ్రగ్ కంట్రోల్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. లింగనిర్ధారణ, బాల్యవివాహాలపై క్షేత్రస్థాయిలో ఆశ, అంగన్వాడీ, ఏఎన్‌ఎంలు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, టీబీ శాఖ అధికారి వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, ఐసీడీఎస్ పీడీ శైలజ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కీర్తన, దిశ ఎస్‌ఐ నాగసౌజన్య, ఎన్జీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పరిశీలనకు రాజస్థాన్ బృందం

చిత్తూరు (సెంట్రల్), జూలై 29: ప్రకృతి వ్యవసాయం పరిశీలనకు రాజస్థాన్ బృందం సోమవారం జిల్లాను సందర్శించింది. అటల్ భుజల్ యోజన కింద ఏడుగురు వ్యవసాయ రాష్ట్ర స్థాయి అధికారులు,ఆరుగురు రైతులతో కూడిన బృందం బంగారుపాళ్యంతో పాటు పలు మండలాలో సాగుతీరను అధ్యయనం చేసింది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఘన, ద్రవ జీవామృతం తయారీ, పెల్లటైజేషన్, విత్తన గుళికలు తయారీని పరిశీలించింది. వేరుశనగకు బదులుగా 18 రకాల పంటలను సాగు చేసే విధానాల గురించి తెలుసుకుంది. స్వయం సహాయక సంఘాల సహకారంలో కిచెన్ గార్డెన్, ప్రొడక్షన్, సెల్లింగ్ విధానాలను చూసింది. ఏపీ స్టేట్ ఎస్‌ఆర్‌పీ సురేంద్రరెడ్డి, కల్పన, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్లలో ఉత్కంఠ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29: సార్వత్రిక ఎన్నికల విధుల నిర్వహణకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్లను తిరిగి వారి ప్రాంతాల్లో చేరేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం రిలీవ్ ఆర్డర్లు ఇచ్చారు. అనంతపురం, నంద్యాల, కడప, అన్నమయ్య, సత్యసాయి, కర్నూలు జిల్లాలకు 31 మంది తహసీల్దార్లు వెళ్లారు. వారిలో కర్నూలు జిల్లాకు వెళ్ళిన ఎనిమిది మంది తప్ప మిగిలిన వారు ఆయా జిల్లాల నుంచి రిలీవ్ అయ్యారు. సోమవారం వారంతా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు రిపోర్టు చేస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వ నిబంధనల మేర మండలాల వారీగా పోస్టింగ్స్ మరో రెండ్రోజుల్లో ఇవ్వనున్నారు.

పీఎఫ్ సమస్య పరిష్కరించకుంటే పోరాటమే

జడ్పీ సీఈవోకు ముందస్తు నోటీసులిచ్చిన ఉద్యోగ సంఘ నేతలు



చిత్తూరు రూరల్, జూలై 29: జడ్పీ పరిధిలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదని ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సీఈవో గ్లోరియాను కలిసి ముందస్తు నోటీసులు ఇచ్చారు. 2019 నుంచి ఇప్పటి వరకు జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో నెలవారీ చందా వివరాలను పూర్తి స్థాయిలో ప్రదర్శనలో ఉంచి అందుకు సంబంధించిన వడ్డీని జమ చేయాలని కోరామన్నారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు రమణ, సోమశేఖర్ నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, రహనా బేగంపాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

తిరుపతి (జీవకోన), జూలై 29: చౌడేపల్లె మండలానికి చెందిన జగదీష్‌కుమార్(32)పై దాడిచేసిన వైసీపీ యువతపై పోలీసులు చర్యలు తీసుకోవాలని హైకోర్టు లాయర్ చరణ్‌కుమార్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో బాధితుడు జగదీష్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. 25వ తేదీ రాత్రి 10గంటల సమయంలో జగదీష్‌కుమార్‌పై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారన్నారు. వైసీపీకి చెందిన కొంతమంది యువత ఆయన ఇంటి వద్ద వచ్చి ఎన్నికల్లో టీడీపీ తరఫున ఎలా పనిచేస్తావంటూ రాడ్లు, రాళ్లతో దాడి చేశారని చెప్పారు. దీనికి సంబంధించిన ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. బాధితుడు మాట్లాడుతూ.. తాను ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నానని..ఇష్టానుసారం దాడి చేయడంతో కన్ను కోల్పోయి, జీవనోపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అధికారులు న్యాయంచేయాలని కోరారు. హేమలత,అమృత్, లీలాకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వరసిద్ధుడి పట్టువస్త్రాలు



పాకాల: ఆడికృత్తిక సందర్భంగా సోమవారం పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామికి కాణిపాకం వినాయక స్వామి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలను చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ దంపతులు తీసుకొచ్చారు. స్వామివారికి సమర్పించి పూజలు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 113 అర్జీలు

చిత్తూరు, జూలై29: కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలు వేర్వేరుగా జరిగాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టరేట్‌లో 113 మంది అర్జీదారులు హాజరై ఫిర్యాదులను అందించారు. రెవెన్యూశాఖకు 90, డీఎస్‌ఎల్‌వోకు 7, డీఆర్‌డీఏకు 2 వినతులతో పాటు మిగిలిన శాఖలకు ఒక్కో అర్జీ వంతున అందాయి. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ఇతరజిల్లా అధికారులు పాల్గొన్నారు.

రికార్డుల్లో నన్ను బతికించండి

మానసిక స్థితి సరిగాలేక 2019లో ఇంటి నుంచి వెళ్లిపోయాను. కడపలోని ఓ ఆశ్రమంలో చికిత్స చేయడంతో కోలుకున్నాను. 2020లో నాలాంటి పోలికలతో ఉన్న ఓ వ్యక్తి మరణించగా తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించేశారు. డెత్‌సర్టిఫికెట్ కూడా తీసుకున్నారు. గతేడాది ఇంటికి వచ్చాను. నేను బతికి ఉన్నట్లు రికార్డులను సరిదిద్దాలని కోరుతున్నాను.

- అంజనేయులుశెట్టి, పైమాఘం, తవణంపల్లె మండలం



సర్వే చేసి భూమి అప్పగించాలి

నా భూమి వైసీపీ వారు ఆక్రమించుకున్నారు. దీనిపై ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. అయినా స్పందన లేదు. నాకు న్యాయం చేయాలి.

- నాగభూషణం, ముదిగోళం, ఐరాల మండలం

● ఇంటి స్థలాన్ని ఇప్పించండి

మా అమ్మ నుంచి నాకు ఇంటి స్థలం సంక్రమించింది. అందులో వైసీపీ నేతలు అక్రమంగా టెంట్‌హౌస్ నిర్మించారు. కోర్టు ద్వారా న్యాయం జరిగినా వైసీపీ నేతలు స్థలాన్ని ఖాళీ చేయడం లేదు.

- మునిరాజా,పెద్దమల్లెల,రొంపిచెర్ల మండలం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మాకు న్యాయం చేయండి



1997లో మాకు ప్రభుత్వం డీకేటీ భూములతో పాటు పట్టాదార్ పాసు పుస్తకాలను ఇచ్చింది. ఈ భూమిని ముష్టిపల్లె, ఎస్‌ఎస్‌కొండ, కోటికట్లవాండ్లవూరుకు చెందిన వారు ఆక్రమించుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలను కూడా లాక్కున్నారు. అధికారులు విచారించి న్యాయం చేయాలి.

- బాధిత యానాదులు, దాసరాపల్లె, జీడీ నెల్లూరు మండలం

పోలీసుశాఖకు 31 ఫిర్యాదులు

పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 31 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ఈ ఫిర్యాదుల్లో భూ తగాదాల కింద 8, ఆస్తి తగాదాలు 7, ఇంటి తగాదాలు 4, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 2, చీటింగ్ కింద 2 చొప్పున ఉన్నాయి. అధికారుల దృష్టికి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సత్వరం పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ సూచించారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.





పంపిణీకి తీసుకెళ్లిన పట్టాలు

చల్లారని సీజేఎఫ్‌ఎస్ భూముల రగడ

జగన్ బొమ్మతో పాసుపుస్తకాల పంపిణీకి రెవెన్యూ అధికారుల చర్యలు ● అభ్యంతరంతో వెనక్కి

వెదురుకుప్పం, జూలై 29: వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె సమీపంలోని సీజేఎఫ్‌ఎస్ భూముల రగడ చల్లారలేదు. ఈ భూముల్లో వైసీపీసహా స్థానికేతరులకు పట్టాలిస్తున్నారని స్థానికులు, టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గత సీఎం జగన్ బొమ్మతో ఉన్న సీజేఎఫ్‌ఎస్ భూముల పట్టా, పాసుపుస్తకాలను ఇవ్వడానికి సోమవారం రెవెన్యూ అధికారులు వెళ్లారు. జగన్ బొమ్మ ఉన్న పాసుపుస్తకాలను ఎలా పంపిణీ చేస్తారని, ఎమ్మెల్యే థామస్‌కి తెలియకుండా ఎలా పంపిణీ జరుగుతుందంటూ టీడీపీ నేత చొక్కా మహేష్ నిలదీశారు. అర్హులందరికీ పట్టాలివ్వాలని పదేపదే కోరినా పట్టించుకోని అధికారులు.. సోమవారం ఇవ్వడానికి ప్రయత్నించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ఆయన ఎమ్మెల్యే థామస్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, రెవెన్యూ వారితో ఎమ్మెల్యే మాట్లాడారని, దీంతో పంపిణీ చేయకుండా అధికారులు వెళ్లారన్నారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే తమకు హామీ ఇచ్చారని మహేష్ చెప్పారు. దేవరగుడిపల్లె సీజేఎఫ్‌ఎస్ భూముల వ్యవహారంపై విచారణ జరిపించి, అర్హులకు న్యాయం చేయాలని నేతలు చంద్రబాబునాయుడు,రాజాజీ, అల్లిబాబు విజ్ఞప్తి చేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

దేవరగుడిపల్లె సీజేఎఫ్‌ఎస్ భూములకు సంబంధించి ఎన్నికల ముందుగా ఈ పట్టాలు సిద్ధం చేసినవి. ఆ భూముల్లో వారు తమకు పట్టాలు అందలేదని గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇవ్వడానికి వెళ్లాం. ఆ పాసుపుస్తకాలపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉండటంతో అభ్యంతరం రాగా, పంపిణీ ఆపేశాం. సీజేఎఫ్‌ఎస్ భూముల్లోని అర్హులందరికీ న్యాయం చేశాం. నాన్ సీజేఎఫ్‌ఎస్ భూముల్లో వారికి పట్టాలు ఇవ్వాలంటే ప్రభుత్వ పాలసీ రావాలి.

-జయంత్‌కుమార్, తహసీల్దార్,వెదురుకుప్పం

లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సస్పెన్షన్

- మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్‌లో ఫైళ్ల కాల్చివేత కేసు ఎఫెక్ట్
- గతంలోనూ క్రమశిక్షణా చర్యలు
- పెద్దిరెడ్డికి సన్నిహితుడిగా ముద్ర



తిరుపతి(కలెక్టరేట్), జూలై 29: తిరుపతి జిల్లా లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళిని సస్పెండ్ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత కేసులో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఆర్డీవోలు సహా ఒక సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.వీరిలో మదనపల్లి ఆర్డీవోగా పనిచేస్తూ తిరుపతికి ఫిబ్రవరి మాసంలో బదిలీపై వచ్చిన మురళి ఒకరు. సుమారు పది రోజుల క్రితం అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను కొంతమంది దగ్ధం చేసిన విషయం తెలిసిందే. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో భారీఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం... అనేక అవకతవకలు జరిగినట్లు గుర్తించడం..వీటిలో మురళికి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో సస్పెన్షన్ వేటు పడింది. మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మురళి అత్యంత సన్నిహితుడు.ఒంగోలులో పనిచేసిన సమయంలో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో మదనపల్లెలో పని చేస్తుండగా సస్పెండ్ చేయడంతో పాటు తహసీల్దారుగా రివర్షన్ సైతం ఇచ్చారు.పెద్దిరెడ్డి జోక్యంతో సస్పెన్షన్ ఎత్తివేయడంతో పాటు రివర్షన్ కూడా ఉపసంహరించుకున్నారు. ఆరు నెలల క్రితం మురళి తిరుపతికి లీగల్‌సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వచ్చారు.

రేపు జేమ్స్‌యెన్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కుప్పం, జూలై 29: కుప్పంలోని డాక్టర్ జేమ్స్‌యన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో కోర్సులకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ ఉమ్మడి జిల్లాల పాలిసెట్ కన్వీనర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష రాసి, అర్హత పొందినవారు, పొందనివారు, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇందుకు అర్హులన్నారు. పాలిసెట్ 2024 హాల్ టికెట్టు, ర్యాంక్ కార్డు, పదో తరగతి మార్కుల సర్టిఫికెట్, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్టు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకు రావాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.7వేలు (పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత పొందినవారికి), రూ.1,100 (పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించని వారికి) ప్రాసెసింగ్ ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు తప్పక తీసుకు రావాలన్నారు. సీటు పొందినవారు రూ.4,700 కళాశాల ఫీజు వెంటనే చెల్లించాలని చెప్పారు. తమ కళాశాలలో డిప్లొమో ఇన్ మెకానికల్, డిప్లమో ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమో ఉన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్ ఇంజినీరింగ్, డిప్లొమో ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయన్నారు. స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందినవారికి ఉపకారవేతనం రాదని తెలియజేశారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. లేదా 99890641000, 9912342101 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముఖం చాటేసిన చినుకు

అధికవేడితో అల్లాడుతున్న జిల్లా ప్రజలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 29: రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు భారీ వర్షాలతో అతలాకుతలం అవుతుంటే జిల్లాలో వర్షపు చుక్క కరువైంది. వేసవి తాపంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈనెలారంభం నుంచి అంతో ఇంతో తేలికపాటి వాన కురుస్తూ వచ్చినా 13వ తేదీ నుంచి వరుణుడు మాయమయ్యాడు. అడపాదడపా చినుకులు కురుస్తున్నా రైతాంగానికి ఉపయోగపడడం లేదు. జూన్ జిల్లా సాధారణ వర్షపాతం 80.8 మిమీ. అంతకు మించి 188.9 మిమీ వర్షం కురిసింది. ప్రజలు, కర్షకులు ఆనందపడ్డారు. ఈనెల సాధారణ వర్షపాతం 103.9 మిమీ. ఇప్పటివరకూ సాధారణానికంటే తక్కువగా 85.1 మిమీ మాత్రమే కురిసింది. గాలిలో తేమ శాతం తగ్గి పగలు, రాత్రి వేడిగాలులు వీస్తున్నాయి. భరించలేని వేసవి తాపం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం 9 గంటల నుంచే 36 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదవుతోంది. సాయంత్రం 5 గంటలకు కూడా వేడిమి తగ్గడంలేదు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందిపడుతున్నారు. ఇదే పరిస్థితి మరో వారం పాటు ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. మధ్యాహ్న వేళలో బయటికి రావడానికి జనం జంకుతున్నారు. బలమైన వర్షాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నీలం మామిడి టన్ను రూ.1.14 లక్షలు

బంగారుపాళ్యం,జూలై29:స్థానిక మార్కెట్ యార్డులో మేలైన నీలం రకం మామిడి టన్ను రూ.1.14 లక్షలు, నాణ్యమైన తోతాపురి రకం టన్ను రూ.95వేలు ధర పలికింది. సోమవారం 18వ నెంబరు మండీకి పెద్దపంజాణి మండలం పొట్టగానిపల్లెకి చెందిన రైతు క్రిష్ణ నీలం రకం మామిడి తీసుకురాగా చెన్నైకి చెందిన వెంకటేష్ ముత్తు రూ.1.14 లక్షలకు వేలం ద్వారా కొనుగోలు చేశారు. పలమనేరుకు చెందిన ఫిరోజ్ తీసుకొచ్చిన మేలైన తోతాపురి మామిడిని బెంగుళూరుకు చెందిన శ్రీనాథ్ టన్ను రూ.95వేలకు దక్కించుకున్నారు. ఐదు రోజుల్లో సీజన్ ముగియనున్నట్లు యజమానులు తెలిపారు.

రైతుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు .

మదనపల్లె అర్బన్, జూలై29 : కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి రైతుల సంక్షేమం, రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మాజీమంత్రివర్యులు, రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గత మంగళ వాం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు కేటా యింపులు తగ్గిపోతున్నాయని ఈ నిధులు వ్యవసాయ రంగాన్ని సంక్షో భం నుంచి రైతుల ఆత్మహత్య నుంచి కాపాడలేవన్నారు. సోమవారం మదనపల్లిలో ఎన్‌వీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య అధ్యక్షతన రైతు సమ్మేళనం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్పొరేట్లకు పన్ను రాయితీలు , రుణమాఫీలు చేస్తున్నారు కానీ దేశానికి తిండి పెట్టే రైతాంగానికి మాత్రం బడ్జెట్ కోతలు పెడుతూ వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుత వ్యవసాయంలో కనీసం సాగు ఖర్చులు కూడా రానటు వంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో రైతు రుణమాఫీ చేసి రుణ ఉపశమనం చట్టం తెచ్చి ఆత్మహత్యల నుంచి రైతులను కాపాడాలని కోరారు. రైతాంగంపై భారాలను మోపే విద్యుత్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడి సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది వ్యవసాయ రంగమేనన్నారు. కరోనా సమయంలో అన్ని రంగాలు మూతపడ్డ వ్యవసాయ రంగం మాత్రం పనిచేసి పంటలు సుభిక్షంగా పండాయన్నారు. వ్యవసాయం లాభసాటిగా మారుతేతప్ప దేశ భవిష్యత్తు మారదని పేర్కొన్నారు. లక్షలకోట్ల రుపాయలు 12 మంది కార్పొరేటర్లకు కట్టపెట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నం చేస్తున్నారని ఆయన విరుచుకుపడ్డారు.

ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రైతు సంఘం రాష్ట్రనాయకులు కాటమయ్య , జమల య్య , కేవీ జగన్నాదం, రామానాయుడు, అప్పల నాయుడు, డేగా ప్రభా కర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్య దర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి సాంబశివ, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు .

రాష్ట్రవ్యాప్త హాట్ టాపిక్‌గా మదనపల్లె

● మాధవరెడ్డి అవినీతి, అక్రమాలు కోకొల్లలు

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లెలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూలై 29: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో కుట్రపూరిత ఫైళ్ల దహనం కేసు రాష్ట్ర వ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. వారం రోజులుగా అసెంబ్లీలో ఏ ఎమ్మెల్యే తనను పలకరించినా ఇదే టాపిక్ అడుగుతున్నారన్నారు. మదనపల్లెలో వైసీపీ నాయకులు బీకేపల్లె హౌసింగ్ కాలనీలో పెద్దఎత్తున కబ్జాలు చేశారన్నారు. ఇక్కడ వైసీపీ నాయకుడు మనోహర్ ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాలంటే రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేశారని, మొత్తం రూ.6 కోట్లు ఈ విధంగా వసూలు చేశారని ఆరోపించారు. పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి బైపాస్‌రోడ్డు పక్కన విలువైన స్థలానికి సంబంధించి రాయచోటి కలెక్టరేట్‌లో తహసీల్దార్, సిబ్బంది కూర్చుని రాత్రికి రాత్రే ఆ భూమికి వన్-బీ సృష్టించారన్నారు. ఈ భూమిని పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలత పేరుతో రిజిస్ట్రేషన్ చేశారన్నారు. బీకేపల్లె సర్వేనెంబర్-2లో విభజన కాకపోయినా, రికార్డులు సృష్టించి కాజేశారన్నారు. వలసపల్లె వద్ద 12 ఎకరాల భూమి ప్రభుత్వ భూమి అని అప్పటి జేసీ వినయ్‌చంద్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కానీ ఆ భూమిని మాధవరెడ్డి కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. రింగ్ రోడ్డులో విద్యుత్ ఉద్యోగులకు చెందిన భూమిలో 10 కుంటల స్థలాన్ని మాధవరెడ్డి కబ్జా చేశారన్నారు. ములకలదిన్నె నుంచి యాతాలవంక వరకు 50 ఎకరాల డీకేటీ భూములను కబ్జా చేశారన్నారు. 596 జీవో అమలు కాకముందు పేదల వద్ద తక్కువ ధరలకే డీకేటీ భూములు కొనుగోలు చేసి జీవో వచ్చాక కోట్లు దండుకున్నారన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే మదనపల్లెను కబ్జాచేశారన్నారు. ఐదేళ్లలో గత ఎమ్మెల్యే, ఎంపీలు ఎవరైనా ఆ భూములను విక్రయించకుంటే వాటిని 22-ఏ జాబితాలో పెట్టించేస్తారన్నారు. 20 సర్వేనెంబర్లను 22-ఏలో పెట్టించారన్నారు. కలెక్టర్ గిరీషా వైసీపీ కార్యకర్తగా పనిచేశారన్నారు. వైసీపీ పాలనలో భూకబ్జాలపై ల్యాండ్‌గ్రాబింగ్ కేసులకు సిఫారసు చేస్తామన్నారు. మండలంలోని సీటీఎం-2 గ్రామంలో రెండు రోజుల పాటు ప్రజలతో సమావేశాలు నిర్వహించి అక్కడ జరిగిన అక్రమాలను వెలికి తీస్తామన్నారు. కొట్టటపల్లెలో వైసీపీ కౌన్సిలర్ల భూకబ్జాలను బయటపెడతామన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పార్థసారథి, రామాంజనేయులు, టీడీపీ నాయకులు విద్యాసాగర్, ఎస్‌ఏ మస్తాన్, షంషీర్, ఆర్‌జే వెంకటేశ్, ఆర్‌కే రామకృష్ణాచారి, బాలుస్వామి, రెడ్డిస్వామి, నాగూర్‌వలి, సుధాకర్, చల్లా నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ దాడులు

● 44 మందిపై కేసులు , రూ.2.47లక్షలు జరిమానా

తంబళ్లపల్లె, జూలై 29: తంబళ్లపల్లె మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్‌ను వాడుతున్న పలు ఇళ్లు, దుకాణాలపై ఆ శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తిరుపతి డీపీఈ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఏ.శ్రీనివాసబాబు, ఈఈ పి.బాలాజి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా విద్యుత్ వాడుతున్న 44 మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రూ.2.47లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ.విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి



చెర్లోపల్లె చెత్తను తొలగిస్తున్న పంచాయితీ అధికారులు

గుర్రంకొండ, జూలై 29:మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో టీడీపీ సర్పంచ్ ప్రేమకుమారి నేతృత్వంలో సోమవారం పారిశుధ్య పనులను చేయించారు. ఇందులో భాగంగా గ్రామంలోని మురుగు కాలువలు, చెత్తచెదారంను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడంతోపాటు వీధి లైట్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని సూచించారు. మురుగు కాలువలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. కార్యక్రమంలో కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యత



మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సహపంక్తి భోజనంలో ఎమ్మెల్యే



ములకలచెరువులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు



కలకడ కోన హైస్కూల్‌లో సహపంక్తి భోజనాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మదనపల్లె అర్బన్, జూలై 29: పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యత అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల్లో సోమవారం మధ్యాహ్నం భోజనాలను ఎమ్మెల్యే పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మోనూ ప్రకారం భోజనాలు, వంటలు అందుతున్నాయా? అన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందే అమ్మచెరువుమిట్టలోని త్యాగరాజ స్వామి ఆలయకమిటీ సభ్యులతో సమావేశమై ఆలయాభివృద్ధికి తోడ్పడతానని ఆయన తెలిపారు. అలాగే చిప్పిలి ప్రాథమికపాఠశాల్లో శుభదిన్ భోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ స్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి, హెచ్ఎంలు హరినాధరెడ్డి, మోహన్‌రెడ్డి, శారద పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని రాహూరివాండ్లపల్లె గ్రామం జంగంరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో సోమవారం శుభ్‌దిన్‌భోజన్ కార్యక్రమంలో భాగంగా 23మంది విద్యార్థులకు ఎంఈవో నారాయణ తన స్వంత నిధులతో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. భోజనంతోపాటు స్వీట్లు అరటి పండ్లను విద్యార్థులకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తనూజతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.

ములకలచెరువులో: ములకలచెరువు మోడల్ స్కూల్‌లో సోమవారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన శిక్షా సంపత్ శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు ప్రిన్సిపాల్ కవిత, విద్యార్థుల తల్లులు అనిత, అశ్వనిల సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. ఎంపీడీవో పోలప్ప, ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలసుబ్రమణ్యం, ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం తిన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం శుభదిన్ భోజనం కార్యక్రమం నిర్వహించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏడో రోజైన సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్థానిక దాతలు, ఉపాధ్యాయుల సహకారంతో స్వీట్లు, బిర్యానీ, వెజిటబుల్ భోజనం పెట్టారు. కార్యక్రమంలో ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొని విద్యార్థులతో కలసి సహంపక్తి భోజనాలు చేశారు.

గుర్రంకొండలో: విద్యార్థులు క్రమశిక్షణను పాటిస్తూ చదువులో రాణించాలని గుర్రంకొండ మాజీ సర్పంచ్ నౌషాద్ అహ్మద్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డు ప్రాథమిక పాఠశాల్లో ఆయన సోమవారం భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుపట్ల శ్రద్ధ వహించి పరీక్షలో మంచి మార్కులు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులు దాతలు అందజేసిన పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

కలకడలో:పిల్లల చదువుపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధచూపాలని ఎంఈవో మునీంద్రనాయక్ సూచించారు. కోన హైస్కూల్‌లో వారం రోజులుగా హెచ్ఎం చెంగల్‌రాయుల ఆధ్వర్యంలో జరిగిన శిక్షా సప్తాహ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన పాల్గొని డిజిటల్ లర్నింగ్, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ఆఖరి రోజున సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో:పాఠశాలల అభివృద్ధి అందరి బాధ్యతని పెద్దమండ్యం ఎంఈవో మనోహర్ పెర్కొన్నారు. పెద్దమండ్యంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఎంఈవోమనోహర్, ఉపాధ్యాయులు కలసి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మనబడి- మన భవిష్యత్తు ద్వారా మనబడిని మనమే బాగుచేసుకోవాలని స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రతి నెల ఒకటవ తేదిన ప్రభుత్వ అన్ని పాఠశాలలో సహపంక్తి భోజనం చేయాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఇవ్వాలన్నారు.

వాల్టాకు తూట్లు.. వృక్షాలకు పోట్లు

● అక్రమంగా చెట్ల నరికివేత ●అంతరించిపోతున్న వృక్షసంపద ● పర్యావరణానికి ముంచుకొస్తున్న పెనుముప్పు



కొండయ్యగారిపల్లిలో అక్రమంగా చెట్లను నరికివేసిన దృశ్యం

నిమ్మనపల్లి, జూలై 29: వాల్టా చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా అడ్డంగా చెట్లను నరికివేసి వాటిని ఇతర ప్రాంతాలలో ఉండే కొయ్యలమండీలకు తరిస్తున్నా పట్టించుకునే నాథుడేకరువయ్యారు. అసలే వృక్ష సంపద నానాటికి తగ్గిపోతూ వాతావరణంలో పెనుమార్పులు వస్తున్నాయని నిపుణులు వాపోతున్నారు. అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి అంతరిస్తున్న వృక్ష సంపదను పరిరక్షించాలని చెపుతున్నా చెట్ల నరికివేత మాత్రం తగ్గడంలేదు. నిమ్మనపల్లె మండలంలోని వెంగంవారిపల్లి, తవళం, నిమ్మనపల్లి, కొండయ్యగారిపల్లి పంచాయతీల్లో కొందరు అక్రమంగా చెట్లను నరికివేస్తున్నారు. ముఖ్యంగా పుంగనూరు, మదనపల్లి, వాల్మీకిపురం నుంచి దాదాపు పది మంది కొయ్యలవ్యాపారం చేస్తూ రైతుల వద్ద నుంచి తక్కువకు వృక్షాలను కొనుగోలు చేసి ఎక్కువ లాభాలకు విక్రయిస్తూ పబ్బంగడుకొంటున్నారు. ఈ తంతు గత మూడు నెలలుగా జరుగుతన్నా పట్టించుకొనే నాధుడు కరువైయ్యాడు. కాగా ఇటీవల నిమ్మనపల్లి, కొండయ్యగారిపల్లిలో చెట్లను నరికి వేసి తరలించేందుకు సిద్ధం అయ్యారు. అంతే కాకుండా తవళం గ్రామ పంచాయతీలో రోజూ రెండు ట్రాక్టర్ల లోడు మొద్దులను ఇతర ప్రాతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. కాగా అటవీశాఖ అధికారులకు ప్రతి నెలా మామూళ్లు అందుతుండడంతోనే ఇలా చెట్ల నరికివేత తరలింపు మూడు చెట్లు అరవై కొమ్మలుగా సాగుతోంది దీని కారణంగా మండలంలో వృక్ష సంపద అంతరించిపోయో ప్రమాదం ఏర్పడింది. వాల్టా చట్టం అంటే సహజవనరులను కాపాడి వాటిని పరిరక్షిచుకోవడమే అని తెలిసినా దానిని అతిక్రమించి చెట్లను నరుతున్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు కోరతున్నారు. ఇదిలా ఉండగా ఈ చెట్ల నరికివేత, తరలింపు సంఘటనలపై సంబంధిత అటవీశాఖ అధికారి గార్డు దీపను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా చెట్లు నరుకుతున్నట్లు తమకు దృష్టికిరాలేదని తెలిపారు. అలాం టి వారిపై తప్పకుండా చర్యల తీసుకొంటామన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. నాటు తుపాకీ పేల్చిన యుకుడిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూలై 29: ఇరువర్గాల ఘర్షణలో నాటు తుపాకీతో కాల్చిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని వలసపల్లె పంచాయతీ నవోదయ కాలనీలో ఆదివారం రాత్రి ఇరువర్గాలు దాడి చేసుకున్న సంఘటనలో నాటు తుపాకీతో దివాకర్ అనే యువకుడు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో రెడ్డిప్రవీన్ అనే యువకుడి తొడలో బుల్లెటు దూరి గాయమై ంది. వెంటనే అతన్ని జిల్లాఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దివాకర్, సురేష్, అన్సర్, ఆనంద్ గొడవ పడుతుండగా మధ్యలో వారించడానికి వెళ్లిన రెడ్డిప్రవీన్‌ను దివాకర్ తన వద్ద ఉన్న నాటు తుపాకీ పేల్చి గాయపర్చారు.

అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలంటూ వినతి

పీలేరు, జూలై 29: పీలేరు పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలంటూ మాలమహానాడు నాయ కులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రాయచోటిలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు మండలం గూడరేవుపల్లె పంచా యతీ పరిధిలో తమకు స్థలం కేటాయించాలని వారు తమ వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ధరణీ కుమార్, సుభాష్, మల్లిఖార్జున, లోకనాథం, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో వైభవంగా కావళ్ల పండుగ



మదనపల్లె అర్బన్, జూలై 29: మండలంలోని నిమ్మనపల్లె రోడ్డు రామాచార్లపల్లె పంచాయతీలో వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో సోమవారం కావళ్ల పండుగను వైభవంగా నిర్వహించారు. ఆలయ దర్మకర్తలు రాచపల్లె సుబ్రహమ్మణ్యం, అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కావళ్లను పట్టణంలో ఊరేగింపుగా తరలి వెళ్లి ఆలయం చేరకుని స్వామికి కావళ్ల సమర్పించారు. పట్టణంలో హరోహార, మేల్ మురగన్ అంటూ భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య స్వామివారిని వేడుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గుజరీ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

మదనపల్లె టౌన్, జూలై 29: మదనపల్లె పట్టణం రింగ్‌రోడ్డులోని గుజరీషాపులో సోమవారం రాత్రి 10.30గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగి రూ.2లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. వెంటనే షాపు యజమాని సయ్యద్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫైర్ సిబ్బందితోపాటు టూటౌన్ సీఐ యువరాజ్ ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేయిస్తున్నారు. దుకాణంలో అగ్నిప్రమాదంతో చుట్టుపక్కల వారు ఆందోళనకు గురయ్యారు.

తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ ఇదేనా..?

● రికార్డుల అస్తవ్యస్తంపై అసహనం వ్యక్తం చేసిన సబ్‌కలెక్టర్



తహసీల్దార్ కార్యాలయలం తనిఖీలు చేస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నిమ్మనపల్లి, జూలై 29: మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు అస్తవ్యస్తంగా ఉండడంపై మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సబ్‌కలెక్టర్ ఈ సందర్భంగా కార్యాలయంలోని ప్రతి గదిలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే రికార్డు గదిని పరిశీలించి గదిలో గందర గోలంగా పడవేసిన ఫైల్స్‌ను చూసి కార్యాలయ నిర్వహణ ఇదేనా అని అధికారులను ప్రశ్నించారు. ప్రజల నుంచి స్వాధీనం చేసుకొన్న నాటు తుపాకీలు సత్వరమే సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశించారు. అంతే కాకుండా విజిటర్స్ రికార్డులు, ఫైల్స్ రికార్డులు తీసుకురావలని ఇన్‌చార్జి తహసీల్దార్ తపస్విని అడగగా వాటిని రాయలేదని తెలుపనడంతో ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసి ఈ సారి ఇలాంటి తప్పులు జరగకుండా చూడాలన్నారు. అనంతరం కార్యాలయానికి తహసీల్దార్ బోర్డు, సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది సమయసాలన పాటించి ప్రజలు నుంచి వచ్చిన అర్జీలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం మదనపల్లిలో జరిగిన సంఘటలనపై సిబ్బంది జాగ్రత్తంగా ఉండాలని ఎలాంటి తప్పులు జరిగినా వారిపై శాఖాపరమైన చర్యలు వుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్‌ప్రసాద్ వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరిస్తాం

మదనపల్లె టౌన్, జూలై 29:ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులు, అర్జీలను విచారించి సత్వరం పరిష్కారం చూపుతామని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీదారుడి సమస్యను సావధానంగా వింటూ సంబంధితశాఖ అధికారులతో చర్చించారు. మొత్తం మీద 150 మంది నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు అర్జీలు స్వీకరించారు. ఈ సమస్యలను సంబంధిత మండలాల అధికారులకు పంపి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో పోలప్ప

ములకలచెరువు, జూలై 29: వచ్చే నెల 1వతేదీ నుంచి జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయాల పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఆగస్టు 1వతేదీన ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రాంభించాలన్నారు. పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే దోమలను నివారిద్దాం, ఆరోగ్యంగా జీవిద్దాం కార్యక్ర మానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి దోమలు నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో ఈవోఆర్డీ మోహన్ ప్రతాప్, ఎంఈవో వెంకటరమణ, ఏవో గౌస్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

సకాలంలో బస్సుల్లేక విద్యార్థుల ఇక్కట్లు



బస్సు ఎక్కడానికి డోర్ వద్ద విద్యార్థుల తోపులాట

రామసముద్రం, జూలై 29: రామసముద్రం నుంచి మదనపల్లెకు వెళ్లే విద్యార్థులు కళాశాలల ప్రారంభ సమయానికి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు బస్సు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది దీంతో ఎప్పుడేం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా పాఠశాలలు , కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం సయయానికి బస్సులు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని ఏబీవీపీ విద్యార్థులు సోమవారం మదనపల్లె డిపో మేనేజర్ గీతకు వినతి పత్రం అందించారు. సమయానికి బస్సులు లేనందున వచ్చిన బస్సులోనే ఎక్కువ మంది విద్యార్థులు ప్రయాణించడం వల్ల కొందరు బస్సు మెట్లపై వేలాడుతూ ప్రయాదకరంగా వెళ్లే పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఆర్టీసీ బస్సులు ఉదయం ఆరు నుంచి ఏడుగంటల మధ్య సాయంత్రం నాలుగన్నర నుంచి ఆరున్నర గంటల మధ్య నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో రామసముద్రం ఏబీవీపీ ఉపాధ్యక్షుడు ఎస్.నవీన్ చెంబకూరు, కార్యదర్శులు శ్రీను, కిరణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు

తంబళ్లపల్లె, జూలై 29: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటర్ విద్యార్థుకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు తంబళ్లపల్లె మండలంలోని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పంపిణీ చేశారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, కేజీబీవీలలో చదువుతున్న సుమారు 320 మంది ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నోటు, పాఠ్య పుస్తకాలను ఆయా కాలేజీలకు సరఫరా చేశారు. కార్యక్రమంలో ఎంఆర్సీ సిబ్బంది నరేష్, శ్రీనివాసులు, సుధాకర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి పేరు మార్పుపై హర్షం



మండల కేంద్రమైన పీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వీట్లను అందిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం జూలై 29 : ప్రభు త్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి కూటమి ప్రభుత్వం పేరును మార్చడం పట్ల కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా సోమవారం పీటీఎం మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కూటమి నేతలు పాఠశాలల్లోని విద్యార్థులకు స్వీ ట్లు, ఆరటిపండ్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నేతలు మాట్లా డుతూ గత ప్రభుత్వ పాలనలో జగనన్న గోరుముద్ద దానిని నేడు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, జగనన్న అమ్మఒడి నేడు తల్లికివందనం, జగనన్న విద్యాకానుక నేడు సర్వేపల్లె రాదాకృష్ణన్ విద్యార్థి మిత్ర, మనబడి నాడు నేడు, మనబడి మన భవిష్యత్తు, అనే పేర్లను మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ యోగా నంద్, ఎంఈవో2 గౌస్‌పీర్, ప్రధానోపాధ్యాయులతో పాటు, ఏపీఎం తిరుమలప్ప, మాజీ ఎంపీటీసీ శేషాద్రి సురేష్, మాజీ సర్పంచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గిరి నాయుడు కుటుంబాన్ని పరామర్శించిన నల్లారి

పీలేరు, జూలై 29: ఇటీవల హత్యాయత్నానికి గురైన కావలిపల్లె పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గిరి నాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సోమవారం పరామర్శించారు. ఒంటిల్లులోని గిరి నాయుడు ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే, గిరితోపాటు ఆయన సతీమణి, సోదరుడి సతీమణి, వారి పిల్లలను పరామర్శించారు. దాడి జరిగిన సమయంలో ఎంతో తెగువ ప్రదర్శించి ఆగంతకులను అడ్డుకున్నారని ప్రశంసించారు. దాడి చేసిన వారిని త్వరలోనే పట్టుకునేట్లు చూస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమరనాథరెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి, పురం రామ్మూర్తి, జీవీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకా తప్పనిసరిగా వేసుకోవాలి

తంబళ్లపల్లె, జూలై 29: బీసీజీ టీకాపై అపోహాలు వీడి అర్హులైన ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి టీకా వేసుకోవాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ సూచించారు. సోమవారం తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి బీసీజీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ..బీసీజీ టీకా చాలా సురక్షితమైనదని దీనిపై ఎటువంటి అపోహాలు అవసరం లేదన్నారు. టీకా వేసుకోవడం వలన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి క్షయ వ్యాధి రాకుండా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా 54 మందికి టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.